క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ..

• నెల్లూరులో భారీ హోర్డింగ్‌ల ఏర్పాటు

నెల్లూరు(క్రైమ్): మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను అంధకారం చేసుకోవద్దని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు. యువత మేలుకో.. భవితను మలుచుకో.. డ్రగ్స్‌ను వదలుకో.. డ్రగ్స్ రహిత సమాజం.. సంక్షేమానికి సంకేతమంటూ జిల్లా వ్యాప్తంగా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు మత్తు పదార్థాల వినియోగంతో సంభవించే సమస్యలపై ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విజయారావు మాట్లాడారు. డ్రగ్స్‌ను వినియోగిస్తే ఆర్నెల్ల నుంచి ఏడాది, డ్రగ్స్‌ను కలిగి ఉన్నా, విక్రయించినా, ప్రోత్సహించినా పది నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా తప్పదని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నా, డ్రగ్స్ విక్రయాలు, సేవనం జరుగుతున్నాయని గుర్తిస్తే డయల్ 100 లేదా ఎస్‌ఈబీ టోల్‌ఫ్రీ నంబర్ 14500కు ఫిర్యాదు చేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా మార్చే చర్యలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): చీటీ తాలూకు నగదును కాజేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. త్యాగరాజనగర్‌లో నివాసం ఉంటున్న విశ్రాంత ఏఎస్సై పెంచలరాజు తన బావమరిది కుమారుడు బాలకృష్ణంరాజు ద్వారా నాయుడుపేటలోని లక్ష్మీవైభవ్ కంపెనీలో రూ.ఐదు లక్షల చొప్పున రెండు చిట్లను వేశారు. ఆయన తలకు 2021లో శస్త్రచికిత్స జరిగింది. ఈ క్రమంలో బాలకృష్ణంరాజు అతని వద్దకు వచ్చి చిట్లు నాలుగైదు నెలల్లో మెచ్యూరవుతున్నాయని, రూ.10 లక్షలు చెక్కుల రూపంలో వస్తాయని చెప్పారు. దీనికి సంబంధించి కంపెనీ ఫారంపై సంతకాలు చేయించుకెళ్లారు. అప్పటి నుంచి చెక్కులు రాకపోవడంతో కంపెనీకి వెళ్లి బాధితుడు విచారించారు. సంతకాలు చేయించుకున్న ఫారాలను బాలకృష్ణంరాజు తన చిట్లకు ష్యూరిటీగా వాడుకొని నగదును కాజేశారని తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్తపై కోడలి కుటుంబసభ్యుల దాడి

నెల్లూరు(క్రైమ్): అత్తపై కోడలి కుటుంబసభ్యులు దాడి చేసి గాయపర్చిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌కు చెందిన నరేష్‌కు బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన రమ్యతో గతేడాది డిసెంబర్‌లో వివాహమైంది. ఆమెకు ఇదివరకే వివాహమైన విషయాన్ని కుటుంబసభ్యులు దాచారు. కొద్ది రోజులకు ఈ విషయం బయటపడటంతో దంపతుల నడుమ విభేదాలు పొడచూపాయి. మూలాపేట కొండదిబ్బలోని కోడలు పెద్దమ్మ ఇంటి వద్దకు నరేష్ తల్లి అమ్మణ్ణి గురువారం వెళ్లారు. కోడలి తల్లి అన్నపూర్ణ, అన్న కుమార్, పెద్దమ్మ స్వర్ణకుమారి, ఆమె కుమారుడు హేమంత్, మరికొందరు కలిసి అమ్మణ్ణిపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): సరస్వతీనగర్‌లోని ఆర్కిడ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వేణుగోపాల్‌రెడ్డిపై దాడి చేసిన వారిపై దర్గామిట్ట పోలీసులు కేసును శుక్రవారం నమోదు చేశారు. బాధితుడి సమాచారం మేరకు.. మాగుంట లేఅవుట్ రైల్వే ట్రాక్ సమీపంలో వాణిజ్య భవనం ఉందని చెప్పారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సిఫార్సు మేరకు అశోక్ అనే వ్యక్తికి భవనాన్ని అద్దెకు ఇచ్చామన్నారు. ఆర్నెల్లుగా అద్దెను సక్రమంగా చెల్లించకపోవడంతో ఖాళీ చేయాలని అశోక్‌పై ఒత్తిడి తెచ్చానని చెప్పారు. ఈ క్రమంలో గిరిధర్‌రెడ్డి రూ.పది లక్షలిస్తేనే ఖాళీ చేయిస్తామని కమలాకర్‌రెడ్డి ద్వారా చెప్పించారని తెలిపారు. తాను తిరస్కరించడంతో కమలాకర్‌రెడ్డి తనను, తన కారు డ్రైవర్ రఫీని ఈ నెల నాలుగున ఇంటికి పిలిచి దాడి చేశారని ఆరోపించారు. తప్పించుకొని వెళ్తుండగా, కారుపై కమలాకర్‌రెడ్డి కుమారుడు రాజేష్‌రెడ్డి రాళ్లతో దాడి చేశారని తెలిపారు. గాయపడిన తాను హైదరాబాద్‌లో చికిత్స చేయించుకొని రెండు రోజుల క్రితం నగరానికి వచ్చానని చెప్పారు. దాడి వెనుక గిరిధర్‌రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ పార్కు ఎదురుగా ఖాళీ స్థలంలో సింగల్ నంబర్లాడుతున్న ఆరుగురిని శుక్రవారం రాత్రి వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,340 నగదును స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : గంజి ఒంటి మీద పడడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై ఆంజనేయులు కథనం మేరకు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన గోపాల్ చంద్ర హల్దార్(52) అనే వ్యక్తి మండలంలోని ముదివర్తి గ్రామ సమీపంలో రొయ్యల గుంత వద్ద కాపలాదారుడిగా పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం భోజనం తయారు చేస్తుండగా గంజి ప్రమాదవశాత్తు గోపాల్‌చంద్ర హల్దార్ ఒంటి మీద పడి దాదాపు 60 శాతం శరీరం కాలిపోయింది. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

త్వరలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కోటమిట్ట అర్బన్ హెల్త్ సెంటర్ పక్కన రూ.50 లక్షలతో కమ్యూనిటీ హాల్‌ను త్వరలో నిర్మించనున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 48వ డివిజన్లో గల కోటమిట మున్సిపల్ క్వార్టర్స్, తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. స్థానిక సమస్యలను ఎంత వరకు పరిష్కరించారాననే అంశాన్ని తెలుసుకునేందుకు గానూ డివిజన్లలో పర్యటిస్తున్నానని తెలిపారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో చికిత్సలు సవ్యంగా జరుగుతున్నాయని వివరించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డివిజన్లో ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఎంపీ ల్యాడ్స్.. పలువురి సహకారంతో నియోజకవర్గంలో వాటర్ ప్లాంట్లను నెలకొల్పామని, పేదలకు మొదటి క్యాన్‌ను ఉచితంగా.. రెండో దానికి రూ.రెండు మేర వసూలు చేయాలని సూచించారు. కొందరు బయటి ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని, వీటిని అరికట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో మార్చి 16 వరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉండదని, డివిజన్లలో పనులు ఎంత వరకు వచ్చాయనే అంశాన్ని తెలుసుకునేందుకు గానూ పర్యటిస్తానని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిక్, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సచివాలయ పరిధిలోని కార్యదర్శులు రీ సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహించాలని సూచించారు. పన్నుల అసెస్‌మెంట్ నంబర్లను అడ్మిన్ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తమ లాగిన్ ద్వారా సీడీఎంఏ పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోపు రీ సర్వేను పూర్తి చేయాలన్నారు.

19న ఘంటసాల వర్ధంతి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): పద్మశ్రీ ఘంటసాల వర్ధంతిని గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో ఈ నెల 19న నిర్వహించనున్నామని ఘంటసాల కళానికేతన్ అధ్యక్షుడు ఆనందరావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కస్తూర్బా కళాక్షేత్రంలోని ఘంటసాల విగ్రహానికి కళానికేతన్ ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించనున్నామని పేర్కొన్నారు. గాయకులు షఫీ, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

కళానీరాజనం నేడు

ఘంటసాల కళానీరాజన కార్యక్రమాన్ని పురమందిరంలో ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నామని నిర్వాహకుడు సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను సుబేదారుపేటలోని సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకొని పాటలు, డ్యాన్స్ పోటీలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, సంగీత విభావరిని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. నజీర్‌బాషా, గోపాల్, కాలేషా, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్‌లో కారుణ్య నియామకాలు



నెల్లూరు(పొగతోట): కారుణ్య నియామకాల ద్వారా పంచాయతీరాజ్ శాఖలో ముగ్గురికి ఉద్యోగాలను కల్పిస్తూ కలెక్టర్ చక్రధర్‌బాబు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ క్రమంలో నియామక పత్రాలను పీఆర్ ఎస్‌ఈ అశోక్‌కుమార్ తన చాంబర్‌లో శుక్రవారం అందజేశారు. జూనియర్ అసిస్టెంట్‌గా పద్మావతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా అమర్‌తేజ, ఆఫీస్ సబార్డినేట్‌గా చలపతికి ఉద్యోగాలను కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడారు. విధులను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఏఓ భాస్కర్ పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలి



నెల్లూరు సిటీ: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనులను మరింత మెరుగుపర్చాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను శుక్రవారం ఆయన నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్, రీ సర్వే, రోడ్ల మరమ్మతులు, తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కమిషనర్ హరిత, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాగరణ ఉద్యమం



నెల్లూరు(బృందావనం): మానవత, నైతికతతోనే సత్సమాజం సాధ్యమని జమాఅతె ఇస్లామి హింద్ నగరాధ్యక్షుడు అన్వర్‌బేగ్ పేర్కొన్నారు. మానవత, నైతికత.. జాగరణ ఉద్యమాన్ని శనివారం నుంచి ప్రారంభించనున్న నేపథ్యంలో ఆహ్వాన పత్రికలు, పోస్టర్లను జెండావీధి సమీపంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక, రాజకీయ, తదితర ప్రముఖులతో రౌండ్‌టేబుల్ సమావేశాలు, చర్చాగోష్ఠులు, కరపత్రాల పంపిణీ, తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. నిర్వాహకులు అబుల్ హసన్, యాకోబ్, ఇలియాజ్, ఆయాజ్, మైనుద్దీన్, సమీ, సందానీ, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



నెల్లూరు (టౌన్): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆరెస్సెస్ భౌతిక ప్రముఖ్ శేషు కోరారు. ఏబీవీపీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలో భారీ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. అనంతరం వీఆర్సీలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించేలా ఏబీవీపీ కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సాయికృష్ణారెడ్డి, జిల్లా కన్వీనర్ అశోక్‌రెడ్డి, నగర సహాయ కార్యదర్శి చందు, నగర కార్యదర్శి యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సత్కారం



నెల్లూరు రూరల్: క్రీడల్లో ప్రతిభ చూపిన వసుంధరను నగరంలోని జ్యోతినగర్‌లో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన జాతీయ మాస్టర్స్ క్రీడల్లో పరుగు, నడక పోటీల్లో కాంస్య పతకాన్ని ఆమె సాధించారు. నారాయణ దంత కళాశాల హెచ్‌ఓడీ కణ్ణన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రసూల్, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ ఆత్మీయ సమావేశం నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని మిలటరీ కాలనీలో గల ఆదరణ మినిస్ట్రీస్‌లో క్రైస్తవ ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నామని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు హృదయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రైస్తవులు హాజరు కావాలని కోరారు.

శ్రీధర్‌బాబుకు పురస్కారం

నెల్లూరు(బృందావనం): నగరానికి చెందిన కవి శ్రీధర్‌బాబు 'జనరంజక కవి' పురస్కారాన్ని అందుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన తెలియజేశారు. గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో కవి రావి రంగారావు సాహితీపీఠం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందజేశారని పేర్కొన్నారు. తన కవితా సంపుటి ఎగురుతున్న పద్యానికి పురస్కారం లభించిందని చెప్పారు.

శంకరమఠంలో 17 నుంచి పూజలు

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి, కంచి కామకోటి పీఠాధిపతి శంకరవిజయేంద్ర సరస్వతి జన్మదినాన్ని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠం ప్రాంగణంలో గల కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరాలయంలో ఈ నెల 17 నుంచి 19 వరకు పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

రైల్వేస్టేషన్లో విస్తృత తనిఖీలు



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రైల్వేస్టేషన్ ఆవరణ, రాకపోకలు సాగించే రైళ్లు, పార్శిల్ ఆఫీస్, ఈస్ట్, వెస్ట్ బుకింగ్ కౌంటర్లు, నార్త్, సౌత్ యార్డుల వద్ద రైల్వే పోలీసులు విస్తృత తనిఖీలను శుక్రవారం చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఫిన్స్‌తో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు రైల్వే సీఐ శ్రీనివాసాచారి మాట్లాడారు. అక్రమ రవాణా, నేర నియంత్రణకు గానూ నిరంతర తనిఖీలను నిర్వహిస్తామని తెలిపారు. నెల్లూరు, గూడూరు, కావలి, సూళ్లూరుపేట ఎస్సైలు హరిచందన, కొండపనాయుడు, అరుణ, మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట ఎస్సై బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): నవాబుపేట ఎస్సైగా శివప్రకాష్ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం ఆయన స్థానిక ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

అసాంఘిక శక్తులు, పాత నేరస్తులపై చర్యలు

• ఐదు నెలల్లో 61 మంది అరెస్ట్



దోపిడీకి యత్నించిన నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): ఒంటరిగా వెళ్లే వారిని కత్తులతో బెదిరించి దోపిడీలు, దొంగతనాలకు యత్నించడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న అసాంఘిక శక్తులు, పాతనేరస్తులపై చిన్నబజార్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. కత్తి పట్టినా, దౌర్జన్యాలకు పాల్పడినా జైలు ఊచలు లెక్కించాల్సిందేనని తమ చేతల ద్వారా నిరూపిస్తున్నారు. చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వేట్రాక్, పొగతోట, సండే మార్కెట్, సోమశేఖరపురం, తదితర ప్రాంతాల్లో కొందరు పాతనేరస్తులు ముఠాలుగా ఏర్పడి ఒంటరిగా వెళ్లే వారిని, ద్విచక్ర వాహనచోదకులను కత్తులతో బెదిరించి వారిపై దౌర్జన్యాలు, దోపిడీ యత్నాలకు పాల్పడుతూ.. ఫిర్యాదులు చేస్తే చంపుతామని బెదిరించసాగారు. దీంతో బాధితుల్లో ఒకరిద్దరూ మినహా మిగిలిన ఎవరూ ఫిర్యాదులిచ్చేందుకు ముందుకు రాకపోవడంతో వారి ఆగడాలు శ్రుతిమించాయి.

మఫ్టీలో సిబ్బంది ఏర్పాటు

ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు ఈ తరహా నేరాలను కట్టడి చేసేందుకు చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు చర్యలు చేపట్టారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి మఫ్టీలో సిబ్బందిని ఏర్పాటు చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కత్తులు పట్టుకొని తిరుగుతూ దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపుతున్నారు. గడిచిన ఐదు నెలల్లో 11 కేసులు నమోదు చేసి 61 మందిని జైలుకు పంపారు. పోలీసుల చర్యలతో పాతనేరస్తులు, అసాంఘిక శక్తులు అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నారు. స్టేషన్ పరిధిలో గతంలో నేరాలు తరచూ జరుగుతుండేవి. అయితే పోలీస్ అధికారుల చర్యలతో నేరాలకు ఫుల్‌స్టాప్ పడింది. రౌడీషీటర్లు, పాతనేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సురేంద్రబాబు హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు, అల్లరిమూకల ఆగడాలు జరుగుతున్నాయని గుర్తిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే తగు చర్యలు చేపడతామని చెప్పారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నెల్లూరు (టౌన్): క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇంటర్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల వార్షికోత్సవ సంబరాలను శుక్రవారం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థినులు అలరించారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ముఖ్యఅతిథులను సత్కరించారు. ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు, డీవీఈఓ మధుబాబు, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ గిరి, వెంకటేశ్వర్లు, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

వీనులవిందుగా త్యాగరాజ కీర్తనలు



నెల్లూరు(బృందావనం): బహుళ పంచమిని పురస్కరించుకొని ఆర్టీసీ సమీపంలోని ఎస్పీబీ సంగీత, నృత్య పాఠశాలలో త్యాగరాజస్వామి కీర్తనలను శుక్రవారం ఆలపించారు. సంగీత అధ్యాపకులు శ్రీవత్సల శిష్య బృందంలోని పలువురు విద్యార్థులు కీర్తనలను ఆలపించారు. లోకేష్‌బాబు, మౌనిక, అచ్యుత్, మల్లికార్జునరావు వాద్య సహకారం అందించారు. తొలుత త్యాగరాజస్వామి చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. ప్రిన్సిపల్ సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంగీత, నృత్య మహోత్సవాలు

ఆర్టీసీ సమీపంలోని ఎస్పీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న యువజన సంగీత, నృత్య మహోత్సవాలు ముగిశాయి. గాత్రకచేరి, నృత్య ప్రదర్శనలను నిర్వహించారు. న్యాయవాదులు రాజశేఖర్‌రెడ్డి, రూప, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఉమెన్స్ కేటగిరీ జూనియర్స్ విభాగంలో జెనెక్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. తర్వాతి స్థానాలను డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల, కావలిలోని విశ్వోదయ, నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల జట్లు దక్కించుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 152 జట్లకు సంబంధించి రెండు వేల మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ యతిరాజ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్, జిల్లా కార్యదర్శులు హర్ష, నవీన్, కోశాధికారి సాయికుమార్, శివ, బీజేపీ నేతలు రాము, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని నారాయణరెడ్డిపేట.. పెద్దచెరుకూరు, చింతారెడ్డిపాళెం సబ్‌స్టేషన్లలో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని ఏఈ శ్రీలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణరెడ్డిపేట, కోడూరుపాడు, నాలుగో మైలు, నవలాకులతోట, పెద్దచెరుకూరు, గుడిపల్లిపాడు, అల్లీపురం, చింతారెడ్డిపాళెం, రాజుపాళెం, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• రేబాలవారివీధి సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా రేబాలవారివీధి, ఎన్టీఆర్ లేఅవుట్, ఉస్మాన్ సాహెబ్‌పేట, ప్రకాష్‌నగర్, ఏసీనగర్, ఉడ్‌హౌస్ సంఘం, మసీదు సెంటర్, సీఆర్పీ డొంక, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ సుకుమార్ తెలిపారు.

• రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా ములుమూడి బస్టాండ్, గుప్తా పార్క్, సంతపేట, పుత్తా ఎస్టేట్స్, వాకర్స్ రోడ్డు, పరమేశ్వరి నగర్, రాజీవ్ గృహకల్ప, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఏఈ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు.

న్యాయవాదులకు నేత్ర పరీక్షలు



నెల్లూరు(లీగల్): నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలను నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి సహకారంతో శుక్రవారం నిర్వహించారు. వైద్యుడు రాజేంద్రరెడ్డి వారి సిబ్బందితో కలిసి నేత్ర పరీక్షలు చేశారు. 100 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీధర్, బార్ కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రంగారావు, నాగేంద్ర సాయి, పద్మాకర్, బాలసుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణారావుకు గౌరవ డాక్టరేట్



నెల్లూరు(బారకాసు): నగరానికి చెందిన లోకాసమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణారావుకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపకుడు సీపీ యాదవ్, వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ప్రెసిడెంట్ అనుపమ ఆధ్వర్యంలో అందజేశారు. లోకాసమస్త హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ సీఈఓ సురేష్, స్టేట్ జనరల్ సెక్రటరీ మహేష్‌నాయుడు, నెల్లూరు టౌన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.